# కల్లోల కాశ్మీరం



భర్తను కోల్పోయిన కాశ్మీరీ మహిళ

**- కె.బాలగోపాల్**


**ఇటీవల మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.బాలగోపాల్, మరికొందరూ కలిసి కాశ్మీరులో పరిస్థితుల అధ్యయనం కోసం అక్కడ పర్యటించారు. ఈ సందర్భంగా కాశ్మీరులో మానవహక్కులు ఉల్లంఘన, కాశ్మీరీ ప్రజల ఆకాంక్షలూ, 370 ఆర్టికల్ అమలు తీరుతెన్నులూ. భారత్-పాకిస్తాన్‌ల వైఖరి, కాశ్మీరీ స్త్రీలపై లైంగిక అత్యాచారాలు తదితర అంశాలపై కె.బాలగోపాల్ 'మనభూమి' ప్రతినిధితో మాట్లాడారు. ఆయన అభిప్రాయాలను ఆయన మాటల్లోనే ఈ దిగువున వ్యాసరూపంలో ఇస్తున్నాం.**

కాశ్మీర్‌లో ఈ మధ్య సైన్యాన్ని ఉపసంహరించటం లేదా సరిహద్దుకు తరలించటం అనే అంశంమీద పాలక పక్షంలోని కాంగ్రెస్, పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ పార్టీలు రెండూ పరస్పర ఆరోపణలూ, భిన్నమైన ప్రకటనలు చేయటం చూస్తున్నాం. ఏదో మొత్తంమీద సైన్యం సంఖ్య తగ్గిస్తున్నారనీ, బలం తగ్గిస్తున్నారనే అభిప్రాయం బయట కలుగుతుంది. కానీ వాస్తవానికీ గత 15-16 సంవత్సరాలుగా ఎంతగా సైన్యం మోహరించబడిఉందో అంతా అట్లానే కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో, వ్యూహాత్మక ప్రాంతాల్లో సైనిక క్యాంపులు అలానే ఉన్నాయి. ఒక్కొక్క క్యాంపు 15 నుండి 20 గ్రామాలను కంట్రోలు చేయటం జరుగుతుంది. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఎక్కడికి వెళ్ళాలన్నా ఆ సైనిక క్యాంపుల ద్వారానే పోవాల్సిందే. సైన్యం అనుమతి లేకుండా ఎక్కడికీ పోవటానికీ ఏ కార్యక్రమంలోనూ పాల్గొనటానికీ, వీలులేని పరిస్థితి ఉంది. ఏ చిన్న నిరసన కూడా సాధ్యం కాదు. అంతగా సైన్యం వారి పౌరస్వేచ్ఛను నియంత్రిస్తుంది. మొదటి నుండి కాశ్మీరులో మిలిటెంట్ల నిష్పత్తికీ, సైనికుల నిష్పత్తి 1:100లో ఉంది. ఇవి సైనిక గణాంకాలే. కాశ్మీరులో మిలిటెంట్ల సంఖ్య సైనిక గణాంకాల ప్రకారం ఏనాడు 3000 నుండి 5000 లకు మించలేదు. కానీ సైన్యం మాత్రం 5 లక్షల నుండి 7 లక్షల దాకా ఉంటుంది. రాబోవు అమరనాథ్ యాత్ర అప్పుడు అయితే ఇంకా సంఖ్య పెరగవచ్చు. ఇంతగా సైన్యం సంఖ్య ఎందుకు ఎక్కువ ఉందంటే ఒక్క మిలిటెంటుకు 100 మంది సైనికులు ఉండటం అనేది చేతకాకకాదు. కేవలం మిలిటెంట్లను ఎదుర్కోవటానికి మాత్రమే కాకుండా కాశ్మీరు పౌరులనూ, ప్రజలను అదుపు చేయటం, వారి స్వేచ్ఛలను నియంత్రించటం జరుగుతుంది. పట్టణాల్లో కొంత మార్పు వచ్చింది. గతంలో సాయంత్రం 6-7 గంటలకే నిర్మానుష్యమయ్యే రోడ్లు ఈరోజు 9-10 గం॥లకు కూడా మార్కెట్‌ల్లో ప్రజలు ఉంటున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి మార్పులేదు. ఈ రకంగా ప్రజలనూ, ప్రజల స్వేచ్ఛనూ బంధించి చర్చలు జరుపుతాం, సంప్రదింపులు చేస్తామని ప్రభుత్వం అంటే దాంట్లో అర్థం లేదు. కాశ్మీరు ప్రజల పోరాట ఆకాంక్షలు తగ్గాయి. ఇండియా నుండి విడిపోవాలనే ఉద్దేశ్యం పోయిందనే దాంట్లో కూడా వాస్తవం లేదు. నిజానికి వారిలో నిరాస నిస్పృహలు చాలా ఉన్నాయి. చాలామంది కాశ్మీరు మిలిటెంట్లు చనిపోతున్నారు. వారి సంఖ్య తగ్గిపోతుంది. పాకిస్తాన్ కూడా అమెరికా ఒత్తిడి మేరకు గతం ఇస్తున్న సమయాన్ని కూడా ఇవ్వటం లేదు. భారత్ ప్రభుత్వం

వాస్తవాధీనరేఖ వెంబడి ముళ్ళకంచె కట్టేస్తే పాకిస్థాన్ కూడా మాట్లాడలేకపోయింది. ఈ అన్నికారణాల రీత్యా మిలిటెంట్ల రాక తగ్గిపోయిన మాట వాస్తవమే. దీనివల్ల నిరాస నిస్పృహలు ఉన్నాయి. మిలిటెంట్ల ప్రవర్తన కూడా ఆదర్శవంతంగా ఏమీలేదు. దానివల్ల కూడా కాశ్మీరు ప్రజల్లో నిరాశ నిస్పృహలు పెరిగాయి. అయినప్పటికీ తమకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కావాలి, తమ భవితవ్యాన్ని నిర్ణయించుకునే అవకాశం తమకు మాత్రమే ఉండాలి, అదొక రాజకీయ హక్కు అనే ఆకాంక్ష ఎంతమాత్రం వారినుండి పోలేదు.

కేవలం అణచివేత, మోసంద్వారా అణగదొక్కి దాన్ని అంతం చేయాలనీ భారత పాలకుల ప్రయత్నం తప్ప ప్రజలు తెలివివచ్చి మారారు అనే అభిప్రాయాల్లో వాస్తవం లేదు. ఎక్కువభాగం బయట ప్రాంతాల్లో భారత ప్రభుత్వం చేసే ప్రచారం, పత్రికారంగం ఇతర విషయాల్లో విమర్శిస్తున్నప్పటికీ కాశ్మీరు విషయంలో ప్రభుత్వంతో గొంతు కలపటమే తమ కర్తవ్యంగా ఇది దేశభక్తి యువత కర్తవ్యంగా భావించటంవల్ల ప్రభుత్వం చెబుతున్నా అభిప్రాయమే వాస్తవాలుగా చెలామణి అవుతున్నాయి. దీని మూలంగానే కాశ్మీరులోని వాస్తవాలు దేశ ప్రజలకు తెలియటం లేదు. ఇక భారత రాజ్యాంగంలోని 370 ఆర్టికల్ అనేది అర్ధరహితంగా తయారయిపోయింది.

తొలినాడు జమ్మూ కాశ్మీరు భారతదేశంలో భాగంగా ఉన్నంతకాలం దానికి స్వయం ప్రతిపత్తి ఉంటుంది. రక్షణ విదేశీ వ్యవహారాలు, ప్రసారసాధనాలు అనే మూడు అంశాలపై మాత్రమే పార్లమెంటుకూ, కేంద్రప్రభుత్వానికి అధికారం ఉంటుంది. మిగతావన్నీ స్వయం ప్రతిపత్తి గలిగిన రాష్ట్ర



ఓ కాశ్మీరీ బాధిత కుటుంబం

ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి. ఈ విలీనం, ప్రజలకు ఆమోదమా? కాదా? అనేది ప్రజాభిప్రాయ సేకరణ (రిఫరెండం) ద్వారా నిర్ణయం అవుతుంది. ఈ రెండు షరతులతో జమ్మూకాశ్మీర్ ఇండియాలో భాగమైంది. రెండోది అసలే అమలు కాలేదు. మొదటి దాన్ని నీరు గార్చటమనేది 370 ఆర్టికల్ ద్వారానే ప్రారంభమైంది. క్లుప్తంగా ఆ మూడు అంశాల మీద మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉంటుంది. మిగతావన్నీ రాష్ట్రప్రభుత్వం అజమాయిషీతో ఉంటాయని మాత్రమే వ్రాసి ఊరుకోకుండా ఒకవేళ రాష్ట్రప్రభుత్వం సమ్మతిస్తే ఇతర విషయాల్లోనూ కేంద్రానికి అధికారం ఉంటుందని వ్రాసారు. దీనికి అనుగుణంగా సమ్మతించే వార్ని మాత్రమే ఇప్పటివరకు జమ్మూ కాశ్మీరులో అధికారంలోనికి రానిచ్చారు చాలా భయంకరంగా అక్కడ ప్రజాస్వామ్యంతో ఆటలాడుతున్నారు. జమ్మూకాశ్మీరు రాష్ట్ర అసెంబ్లీకి 60 నుండి 70 శాతం సీట్లు ఏకగ్రీవంగా ఎన్నికౌతున్నారంటే ప్రజాస్వామ్యం ఎంతగా లేకుండా పోయిందో మనకు అర్ధమౌతుంది. ఆర్టికల్ 370 స్ఫూర్తిని క్రమంగా త్రవ్వేస్తూ చాలా అంశాలమీద అధికారాన్ని కేంద్రానికి ఇచ్చేస్తున్నారు. కేవలం 370 ఆర్టికల్ మాత్రమే మిగిలి ఉంది. దీన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించడమనేది మొదటి అడుగుకావాలి. అంతకంటే పైకి పోవాల్సిన అవసరం ఉంటుంది. 1952-1953 సం॥నాటి 370 అమలు తీరును తీసుకొని రావాల్సిన అవసరం వుంది. దీనికి పాలకులు సిద్ధంగా లేరు. పాకిస్థాన్ తీవ్రవాదులకు శిక్షణ నివ్వటం అనేది వాస్తవమే. ఎటొచ్చి ప్రజలు పాకిస్థాన్‌లో మాతోటి ప్రాంతమైన ఆక్రమిత కాశ్మీరులో శిక్షణ పొందుతున్నామంటున్నారు. మావాళ్ళే మాకు శిక్షణ నిస్తున్నారు తప్ప పాకిస్థాన్ ఎంతమాత్రమూ కాదని గట్టిగా చెబుతున్నారు. ఇది కూడా పూర్తిగా వాస్తవం






కాకపోవచ్చు. పాకిస్థాన్‌లోనూ, పంజాబ్ ప్రాంతంలోనూ శిక్షణా శిబిరాలు ఉన్నట్లున్నాయి. ఏమైనప్పటికీ ఇండియా కూడా బర్మాదేశంలోని తిరుగుబాటుదార్లకు, శ్రీలంకలోని ఎల్‌టిటిఇ తీవ్రవాదులకు సహాయాన్ని అందించింది. అదేవిధంగా పాకిస్థాన్ కూడా కాశ్మీరును తనలో కలుపుకోవాలనే కోరిక ఉంది కాబట్టి అందుకు సహాయానిస్తుంది. ఏదిఏమైనా కాశ్మీరు ప్రజలు ఏమి కోరుకుంటున్నారు, వారి ఆలోచనకు మూలమేమిటనేది చూడాలి తప్ప పాకిస్థాన్ శిక్షణ ఇస్తుందా లేదా అనేది ప్రధానం కాదు..నిజానికి ఈ రోజు పరిస్థితి ఏమంటే అమెరికా, పాకిస్థాన్‌పై చాలా ఒత్తిడి పెడుతుంది. అమెరికా కాశ్మీరులో న్యాయం కోరుకోవటం లేదు, శాంతి కోరుకుంటుంది.


అమెరికాకు శాంతి ఎందుకు కావాలంటే ముస్లిం ప్రజల్లో అలజడి ఉండకూడదని దానివల్ల ఆల్‌ఖైదా బలపడుతుందని అమెరికా అభిప్రాయం. అందువల్లనే ముస్లిం ప్రజానీకంలో అలజడి ఎక్కడుందో అక్కడ ఏదో రకంగా చల్లార్చాలని అమెరికా పనిచేస్తుంది. న్యాయంగా, హక్కులు కాపాడాలనే దాంతో పనిలేదు. ఇదే ఆలోచనతో కాశ్మీరులోని అశాంతిని చల్లార్చాలని ప్రయత్నిస్తుంది. ఇది కొంత పాకిస్థాన్ చేతిలోనూ, కొంత ఇండియాలోనూ ఉంది కాబట్టి మిలిటెంట్లకు సహాయం చేయటం తగ్గించమని, మిలిటెంట్ల ప్రతినిధి అయిన హురియత్ కాన్ఫరెన్స్‌ను ఇండియాతో మాట్లాడించమని పాకిస్థాన్ మీద ఒత్తిడి చేయటం జరుగుతుంది. అదేవిధంగా హురియత్ కాన్ఫరెన్స్‌తో డైలాగ్ మొదలు పెట్టమని అమెరికా ఇండియాను ఒత్తిడి చేస్తుంది. అమెరికా ఒత్తిడులకు ఇటు ఇండియా, అటు పాకిస్థాన్ తలొగ్గాయి. దీంతో ఏమి జరిగాయంటే హురియత్ కాన్ఫరెన్స్‌లో భాగమైన కొన్ని సంస్థలు దానినుండి దూరమయ్యాయి. దీనికి కారణం భారతదేశంలో కాశ్మీరు భాగం కాదు అనే అభిప్రాయం మొదట్లో అందరికీ ఉన్నప్పటికీ రాను రాను హురియత్ కాన్ఫరెన్సు మీద చాలామంది విశ్వాసం కోల్పోయారు. ముందునుండి ప్రధాన పాత్ర పోషిస్తున్న యాసిన్‌మాలిక్ లాంటివారు ఇండియాలో డైలాగ్‌కు ఒప్పుకోవటంలేదు. కొందరు మాత్రమే (హురియత్ కాన్ఫరెన్స్ నేతలు) ఇండియాతో చర్చలు జరుపుతున్నారు. అయితే ఒక అజెండా, లక్ష్యం లేకుండా ఈ చర్చలు జరుగుతున్నాయి. దీనివల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. ఉదాహరణకు నాగాలాండ్ పోరాట సంస్థలలో భారత పాలకులు చర్చలు జరుపుతున్నారంటే ఎలాంటి ఆర్భాటం లేకుండా ప్రశాంతంగా చర్చలు జరుపుతూ 10 సం॥రాలు కాల్పుల విరమణ ఒప్పందం అమలౌతుంది. కాశ్మీరు విషయంలో మాత్రం చర్చలు బూటకపు వ్యవహారంగా మారాయి. ఇండియాతో మాట్లాడే సంస్థలపై రాజకీయనాయకులపైనా అక్కడి ప్రజలకు గౌరవం లేదు. వాస్తవానికి అందరికీ ఉన్న భయం ఏమంటే ఇండియా పాకిస్థాన్ కలసి అమెరికా ఒత్తిడి మేరకు ఇటు ఇండియా అటు పాకిస్థాన్ రాజీపడిపోతే అప్పుడు మేము యుద్ధం చేయలేమని భావిస్తున్నారు. వాస్తవానికి కాశ్మీరు సంస్థలకు పాకిస్థాన్ సహాయం లేకపోతే యుద్ధం చేయలేరు. కాశ్మీరులోయ జనాభా హైదరాబాద్ జనాభా కంటే తక్కువగా ఉంది. గతంలో అమెరికా ప్రెసిడెంట్ బిల్‌క్లింటన్ ఉన్నప్పుడు కాశ్మీరు సమస్యకు సంబంధించి ఒక చర్చ పెట్టాడు. ఇటు పాకిస్తాన్‌కూ, అటు ఇండియాకు 'ఇగో' ప్రధాన సమస్య కాబట్టి, 'ఇగో' దెబ్బ తినకుండా ఉండాలంటే కాశ్మీరును కొంత ఇండియాలోనూ, కొంత పాకిస్తాన్‌లోనూ ఉంచి ఉమ్మడి కాశ్మీరుకు మాత్రం సార్వభౌమత్వం ఉండాలని చెప్పారు. వీరిద్దరూ ఉమ్మడి సార్వభౌమత్వాన్ని గౌరవిస్తారనే గ్యారంటీ ఎవరిస్తారనే చర్చరాగా అమెరికా గ్యారంటీ ఇస్తుందని క్లింటన్ చెప్పారు. దీనిపై అక్కడ నేతలు స్పందిస్తూ ఇప్పుడు ఒక బానిసత్వంతోనే చస్తున్నాం. అమెరికా ఈ మూడంచెల బానిసత్వం మాకు అవసరంలేదని విమర్శించారు. న్యూఢిల్లీలో భారత ప్రజలు అమెరికా ప్రతిపాదనకు అనుకూలంగా ఉన్నారనేది వాస్తవం. దీనికి అనుకూలంగా ముషారఫ్ కూడా మాట్లాడారు. బహుశా అమెరికా ప్రోద్భలంతోనే ఇరుదేశాలు ఈ దిశగా సాగుతున్నాయనే సందేహం చాలామందికి ఉంది. ఈ అంగీకారానికి



వారు వస్తే పాకిస్థాన్, మిలిటెంట్లకు సహాయం చేయటం మానేస్తుంది. అప్పుడు మిలిటెంట్లును ఏరిపారెయ్యటం సులభం కాబట్టి ఇలాంటి అన్యాయమైన పరిష్కారాన్ని కాశ్మీరు ప్రజలపై రుద్దబోతున్నారు.

ఇక కాశ్మీరులో శాంతి భద్రతల పరిరక్షణ అనేది పోలీసుల చేతిలో లేదు. మొత్తం సైన్యమే నియంత్రిస్తుంది. 1990-96 సం॥ ముందు కాశ్మీరులో సైన్యం పోలీసులను కూడా విశ్వసించలేదు. ఇప్పటికీ పోలీసులపై పెద్దగా సైన్యానికీ విశ్వాసం లేదు. 2003లో మేము కాశ్మీరు పర్యటనకు వెళ్లినపుడు ఒక ఆర్మీ అధికారి మమ్మల్ని ఆపి చాలాసేపు చర్చపెట్టారు. పలానాచోట ఒక కాశ్మీరు అమ్మాయిని సైనికులు లైంగిక అత్యాచారం చేసి చంపేసారంటే మీరు పోలీసు దర్యాప్తు ఎందుకు చేయనీయటం లేదనే మా ప్రశ్నకు సమాధానంగా ఆయన, ఒకే ఇంట్లో అన్న పోలీసు కానిస్టేబుల్‌గానూ తమ్ముడు మిలిటెంట్‌గానూ ఉంటున్నారు. మేము ఎలా నమ్మగలుగుతామన్నారు. ఇది 1996 కు ముందు సైన్యానికి పోలీసులంటే అసలే విశ్వాసం ఉండేది కాదు. పోలీసు స్టేషన్‌లో కూర్చున్న ఎస్.ఐ ను ఆర్మీ అరెస్టు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. క్రమంగా శాంతి భద్రతల విషయంలో పోలీసులకు భాగస్వామ్యం కల్పించటం మొదలుపెట్టారు. పోలీసుల్లో అతి క్రూరమైన స్పెషల్ ఆఫీసర్లను తయారు చేసారు. వారూ అత్యాచారాలు చేస్తున్నారు. దీంతో పోలీసులపై ప్రభుత్వానికీ నమ్మకం ఏర్పడిపోయింది. కాబట్టి సరిహద్దు ప్రాంతాల్లో సైన్యాన్ని ఉంచి లోయ లోపలి భాగాన్ని పోలీసులకు వదిలేయాలనే మాట వస్తుంది. కానీ విచారణలో భాగంగా పోలీసులు ఇళ్ళ మీదకు పోయి దాడులు చేస్తున్నప్పటికీ గ్రామాల్లో ఎక్కడి సైనిక క్యాంపులు అక్కడే ఉన్నాయి. ప్రజల్లో పౌరజీవితాన్ని నియంత్రించే పనిని పూర్తిగా సైన్యమే చేస్తుంది. ఇక అత్యాచారాల మాటకొస్తే గత 19 సం॥రాలుగా 80 వేలమంది చనిపోయారనేది అంచనా. దీంట్లో 3వ వంతు మిలిటెంట్లూ, 2/3 వంతు సైన్యం, పోలీసులూ, పారా మిలటరీ దళాలు కలసి చంపారనేది అందరూ అంగీకరిస్తున్న విషయం. కాశ్మీరు మహిళలపై లైంగిక అత్యాచారాలు రిపోర్టు కావటం చాలా కష్టం. ఇంటి మీదకుపోయి బలప్రయోగంతో రేప్ చేసే సంఘటనల కంటే చాలామంది కాశ్మీరీయులను బాధపెట్టేది ఏమంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆర్మీ క్యాంపులు అక్కడనే వ్యభిచార గృహాలను తయారుచేయటం. భర్త చనిపోయిన వాళ్ళనూ, దిక్కూమొక్కూలేని స్త్రీలను మంచిగానో, మరొక రకంగానో బట్టలు, వస్తువులు కొనిచ్చి లొంగదీసుకోవటమూ, వారు అలవాటు పడటం జరుగుతుంది. పైకి చూస్తే ఇదొక గత్యంతరం లేని సంబంధంగా కనిపించినా బలవంతంగా చూడొచ్చు.. ఇది కాశ్మీరు సంస్కృతినీ, కాశ్మీరులో





ప్రజానీకాన్ని నాశనం చేస్తుందని చాలా మందికి కోపం వుంది.

ఇవికాకుండా ప్రత్యక్ష బలప్రయోగంలో సైన్యం రేప్‌లు జరగటం లాంటి సంఘటనలు చాలా జరుగుతున్నాయి. సైన్యం మిలిటెంట్లపై కాల్పులు జరిపేటప్పుడు ప్రజల్ని హ్యూమన్ షీల్డుగా వాడుకోవటం ఆ కాల్పులలో ప్రజలు చనిపోవటం జరుగుతుంది. అదే విధంగా ఏదైనా ఒక ప్రాంతంలో ప్రేలుడు వస్తువు ఉందని సైన్యానికి అనుమానం వచ్చినపుడు సాధారణ పౌరులను పిలిచి దాన్ని తీయించటం జరుగుతుంది. ఇటీవల ఇంగ్లాండులో కారులో ఎక్స్‌ప్లోజర్స్ ఉన్నాయని గుర్తించి అక్కడి పోలీసులు ఇక్కడి మాదిరిగా ప్రజల్ని పంపకుండా వారే తీసిపారేసారు. అది వాళ్ళ ఉద్యోగం. ఇక్కడ కాశ్మీరీ ప్రజలపై కక్ష తీర్చుకోవటానికి ఈ రకమైన పద్ధతులకు ప్రభుత్వమూ, సైన్యం పాల్పడుతుంది. ఎక్కడో ఒకచోట ఎన్‌కౌంటర్ జరిగి ముగ్గురు సైనికులు చనిపోతే ఆ కేసుతో సైనికులు గ్రామానికి వచ్చి 'జమాతే ఇస్లామీ' కార్యకర్త మసీదులో నమాజ్ చేసుకుంటుంటే అతన్ని బయటకు లాక్కొచ్చి మసీదు గోడకు నిలబెట్టి కాల్చిచంపారు. ఇలాంటి అనేక సంఘటనలపై నేరపరిశోధనలు లేవు , శిక్షలూ లేవు. ★